
సాక్షి
వైఎస్సార్ జిల్లా

బుధవారం । 12 । మార్చి । 2025



జమాలయ్యా..సలామయ్యా!

హిందూ-ముస్లిం సఖ్యత, సామరస్యాలకు ప్రతి రూపంగా భాసిల్లుతోంది కృష్ణంపల్లె జమాలయ్య దర్గా. కోర్కెలు తీర్చే కల్పవృక్షంగా జమాలయ్యను భక్తులు విశ్వసిస్తుంటారు. -8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధ॥ (సా॥)	సహర్ గురు॥ (ఉ॥)
కడప	6.30	5.09
పులివెందుల	6.32	5.14
ప్రొద్దుటూరు	6.31	5.13

గరిష్టం/కనిష్టం **35.2/21.4**

వాతావరణం

జిల్లాలో మంగళవారం 21.4 - 35.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

865 మంది గైర్హాజరు

కడప ఎడ్యుకేషన్: ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో బాగంగా మంగళవారం 64 పరీక్షా కేంద్రాలలో నిర్వహించిన ఇంటర్ ప్రథమ ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు 865 మంది గైర్హాజరయినట్లు ఇంటర్ ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. ఇందులో జనరల్‌కు సంబంధించి 17195 మందికిగాను 747 మంది, ఒకేషనల్‌కు సంబందించి 1467 మందికిగాను 118 మంది గైర్హాజరయ్యారని వివరించారు.

నేడు ఖోఖో సీనియర్స్ ఎంపికలు

కడప ఎడ్యుకేషన్: చింతకొమ్మదిన్నె మండలం బయనపల్లి శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల స్థాయి ఖోఖో పురుషులు, మహిళలు ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా ఖోఖో సంఘం అధ్యక్షుడు డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి , కార్యదర్శి జె.నరేంద్ర తెలిపారు జిల్లా నుంచి ఎనిమిది మంది ఎంపిక చేసి ఈనెల 14, 15 తేదీల్లో పురుషులకు 16న మహిళలకు బాపట్ల జిల్లా జె.పంగులూరు ఎస్ఆర్ఆర్ ఖోఖో క్రీడా మైదానంలో డైరెక్ట్ నేషనల్ ఎంపికలు జరుగుతాయని వివరించారు.

రూటే..సప'రేటు' కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్..

కడప రూరల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో జరిగిన అవకతవకలపై గత శుక్రవారం 'సాక్షి'లో రూటే..సప'రేటు'అనే కథనం ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి స్పందించారు. సోమవారం సాయంత్రం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను పిలిపించి, సమగ్రంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. జరిగిన అంశాలపై సీరియస్ అయ్యారు. ఇలాంటి సంఘటనలు జరిగితే ఉపేక్షించేది లేదని చెప్పినట్లుగా సమాచారం. ఈ అంశంపై ఎలాంటి పరిణామాలు ఉంటాయో అని ఆ శాఖలో విస్తృతంగా చర్చ జరుగుతోంది.

మాలెపాడు సర్పంచ్ చెక్ పవర్ రద్దు

ఎర్రగుంట్ల: మండల పరిధిలోని మాలెపాడు గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ శకుంతలమ్మ చెక్ పవర్ రద్దు అయినట్లు ఈఓపీఆర్డీ రంతులయ్య మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామంలో ఆర్డీపీపీ సీఎస్ఆర్ నిధులు, ఎంపీ నిధుల కింద రెండు వాటర్ ప్లాంట్లను నిర్మించారు. వీటి మెయింటైన్స్ కోసం ఆర్డీపీపీ సీఎస్ఆర్ కింద రూ.23,21,101 నిధులను ఇచ్చిందన్నారు. ఈ నిధులను గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా దుర్వినియోగం చేశారని తేలడంతో సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేస్తూ డీపీఓ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. చెక్ పవర్‌ను ఈఓపీఆర్డీకి ఇచ్చినట్లు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కడప జిల్లా శాఖలో అకౌంటెంట్ పోస్టుకు ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా సెక్రెటరీ సురేష్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి అర్హత గల వారు పూర్తిచేసిన దరఖాస్తు ఫారాలను ఈనెల 25వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా నగరంలోని మట్టి పెద్దపులివద్ద ఉన్న రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయంలో నేరుగా అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు 08562 272829 లేదా 9441513490 నెంబరులో సంప్రదించాలన్నారు. ఎంపికైన అభ్యర్థికి రూ.11,700 గౌరవ వేతనం ఉంటుందని, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగే సమావేశంలో ఈ పోస్ట్ కు తగిన అభ్యర్థిని ఎంపిక చేస్తారని తెలిపారు. కనీసం రెండేళ్ల అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని వివరించారు.

రేపు పులివెందులలో జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, డిపార్టుమెంటు ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఈనెల 13వ తేది ఉదయం 9.30 గంటగలకు పులివెందులలో జాబ్‌మేళా నిర్వహించనున్నామని నిర్వాహకులు దివాకర్, చంద్రబాబులు తెలిపారు. పులివెందులలోని ఔటర్ రింగ్‌రోడ్డు సమీపంలోని నగిరిగుట్టలోని న్యాక్ సెంటర్‌లో ఈ జాబ్‌మేళా ఉంటుందని పేర్కొన్నారు. నవత ట్రాన్స్‌పోర్టు సంస్థలో క్లర్క్, డ్రైవర్లు, క్లీనర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. అభ్యర్థులు 5వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదివి ఉండాలన్నారు. కొప్పర్తిలోని అల్ డిక్సన్ (కిరణ్ సర్వీసెస్) సంస్థలో అసెంబ్లింగ్ ఆపరేటర్స్ అండ్ క్వాలిటీ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివిన వారు అర్హులని వివరించారు. ఎంపికైన వారికి రూ. 12 వేల నుంచి రూ. 18 వేల వరకు వేతనాలు, ఇతర ప్రయోజనాలు ఉంటాయన్నారు. 30 ఖాళీలు ఉన్నాయని, అభ్యర్థులు 19–28 ఏళ్లలోపు కలిగి ఉండాలన్నారు. ఇతర వివరాలకు 96400 15507, 83744 91240 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

వంచనపై గర్జన

- యువత, విద్యార్థులపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న కూటమి సర్కార్
- కొత్త పరిశ్రమల్లేవు..నూతన ఉద్యోగాల్లేవు.. భృతి ఊసే లేదు
- ప్రభుత్వంలో తాండవిస్తున్న నిర్లక్ష్యం.. విలవిలలాడుతోన్న సామాన్యులు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ సక్రమంగా లేక ఆవేదనలో లక్షల మంది విద్యార్థులు



సాక్షి ప్రతినిధి, కడప: విద్యార్థుల చదువులపై బాధ్యత లేదు. యువత ఉపాధి, భవిష్యత్‌పై అస్సలు చొరవ లేదు. కార్మికులు, కర్షకులపై చిత్తశుద్ధే లేదు. మహిళాభివృద్ధి ఉన్నతి కోసం కృషి చేసిన దాఖలాల్లేవు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కార్ నిర్లక్ష్యపు తీరిది. ఇక జిల్లాలోని మెడికల్ కళాశాల కళాశాల నిర్వహణపై విముఖత చూపింది. నేషనల్ మెడికల్ కౌన్సిల్ మంజూరు చేసిన ఎంబీబీఎస్ సీట్లు వద్దని తెగేసి చెప్పడం బాబు వివక్ష పాలనకు దర్పణం పట్టింది.ఈ నేపథ్యంలో విద్యార్థులు, యువత పోరుబాట పట్టారు. బుధవారం జిల్లా కేంద్రంలో వైఎస్సార్ సీపీ నేతృత్వంలో 'యువత పోరు' కార్యక్రమం చేపట్టేందుకు సంసిద్ధులయ్యారు. జిల్లా కేంద్రంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ భారీ ర్యాలీ చేపట్టనున్నారు.

- రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థపై చిన్నచూపు ప్రదర్శిస్తోంది. గత ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సర్కార్ గ్రామాల్లో సైతం కార్పొరేట్ విద్యకు దీటుగా ప్రభుత్వ చదువులుండాలనే సంకల్పాన్ని ఆచరణలో చూపెట్టారు. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలను అద్భుతంగా తీర్చిదిద్దారు. విద్యార్థులను ప్రోత్సహించారు. ఉన్నత చదువులపై చిత్తశుద్ధి ప్రదర్శించారు. ఎప్పటికప్పుడు ఫీజు రీయింబర్స్‌మెంట్ క్లియర్ చేస్తూ వచ్చారు. చంద్రబాబు సర్కార్‌లో ఇప్పటి వరకూ ఫీజు రీయింబర్స్‌మెంటు పూర్తి స్థాయిలో చెల్లింపుల్లేవు. జిల్లాలో 44,876 మంది విద్యార్థులకు దాదాపు రూ.155కోట్లు పైబడి రావాల్సి ఉండగా కేవలం రూ.34.52కోట్లు చెల్లించారు. ప్రతి మూడు నెలలకు ఓమారు విద్యా దీవెన నిధులు ఇవ్వాల్సి ఉండగా, ఒక్కమారు మాత్రమే చెల్లించారు. వసతి దీవెన నిధులు అస్సలు మంజూరు చేయలేదు. పెండింగ్ బకాయిలు చెల్లింపులు లేవు, దీంతోసామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు వేదనకు గురవుతున్నారు.

ఉపాధి లేదు... నిరుద్యోగ భృతి అసలే లేదు...

వైఎస్సార్‌సీపీ సర్కార్‌లో కొప్పర్తి పారిశ్రామికవాడలో ఆల్‌డిక్సన్, సెంచురీప్లై బోర్డ్స్ సంస్థల ద్వారా వేలాది మందికి ప్రత్యక్ష ఉద్యోగ ఉపాధి లభించింది. స్థానికులకే అవకాశం కల్పించాలన్న నిబంధనలతో బద్వేల్ పరిసర ప్రాంతాలకు చెందిన దాదాపు 2వేలు మందికి ఉద్యోగాలు లభించాయి. కొప్పర్తి పరిసర ప్రాంతంలో మరో 3వేల మందికి ఉద్యోగాలు దక్కాయి. కూటమి ప్రభుత్వంలో జిల్లాకు కొత్తగా వచ్చిన పరిశ్రమలు లేవు. వస్తాయన్న నమ్మకాలు సన్నగిల్లాయి. ప్రత్యక్ష ఉపాధి మార్గాలకు అవకాశం కన్పించలేదు. ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3వేలు అందిస్తామని చంద్రబాబు ఎన్నికల హామీ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా 2.80లక్షల మంది యువనేస్తం పథకానికి అర్హులుగా ఉన్నారు. వీరికి నెలకు రూ.84కోట్లు చెల్లించాల్సి ఉంది.

మంజూరైనా.. వద్దన్నారు

నిరుపేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే తపనను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రదర్శించారు. పులివెందులలో రూ.530కోట్లతో ప్రభుత్వ మెడికల్ కళాశాలను నిర్మించారు. 50 ఎకరాల విస్తీర్ణంలో 627 పడకలు వసతి గల ఆస్పత్రి నెలకొల్పారు. ఏడాదికి 150 మెడికల్ సీట్లు, 60 నర్సింగ్ సీట్లలో విద్యను అభ్యసించేలా వసతులు సమకూర్చారు. 50సీట్లు కేటాయిస్తూ ఎన్ఎంసీ ఆగస్టు 5న ఉత్తర్వులు జారీ చేసింది. మంజూరైన ఎంబీబీఎస్ సీట్లు వద్దంటూ రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయడం గమనార్హం. పైగా ఆయా మెడికల్ కళాశాలను ప్రవేటు పరం చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుండం వింతగా పలువురు వాపోతున్నారు.

అన్ని వర్గాలకు మోసమే



ఎన్నికల ముందు టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు ఊరూరా తిరిగి సూపర్ సిక్స్ హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయ డం లేదు. రూ.4వేల పింఛన్ ఇస్తామని చెప్పి పింఛన్ల సంఖ్యను తగ్గిస్తున్నారు. **- పి. జయచంద్రారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి, వైఎస్సార్‌సీపీ**

నిరుద్యోగులను వంచించిన ప్రభుత్వం



కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను దారుణంగా మోసం చేసింది. నెలకు రూ.3వేల నిరు ద్యోగ భృతి ఇస్తామని ఇవ్వలేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.3900 కోట్లు విడుదల చేయలేదు. హామీలు అమలు చేసే వరకూ పోరాటం ఆగదు. **- దేవిరెడ్డి ఆదిత్య, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం**

ఎస్సీ, ఎస్టీ, బీసీలను పట్టించుకున్న పాపాన పోలేదు



సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీలను ఈ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. ఎన్నికల ముందు వారికి ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక మరిచారు. **- సీహెచ్ వినోద్ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు.**

నేటి 'యువత పోరు'ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా.. చిత్రంలో మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు బుధవారం నిర్వహించనున్న 'యువత పోరు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక తన కార్యాలయంలో మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డిలతో కలిసి వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలకు ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. ఇటీవల పూర్తి స్థాయిలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కూడా ఈ హామీలపై స్పష్టత ఇవ్వక పోవడం దారుణమన్నారు. విద్యార్థులకు రూ.3900కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు ఇంకా విడుదల చేయలేదని, దీనివల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఒత్తిడి తెస్తున్నాయన్నారు. రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులను ఈ ప్రభుత్వం మోసం చేసిందని, బుధవారం నిర్వహించే 'యువత పోరు'లో వారంతా భాగస్వాములై ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో జెండా ఆవిష్కరణ అనంతరం ర్యాలీ ప్రారంభమవుతుందని, మహావీర్ సర్కిల్ మీదుగా ఈ ర్యాలీ కలెక్టరేట్‌కు చేరుకుంటుందని, ఆ తర్వాత కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తారని తెలిపారు.

ప్రజల గుండెల్లో వైఎస్సార్‌సీపీ జెండా!



విలువలు, విశ్వసనీయతే ఆ పార్టీ మూల స్తంభాలు... సంక్షేమం.. అభివృద్ధి ఆ పార్టీ సిద్ధాంతాలు.. ప్రజా పక్షమై పోరాటాలు చేయాలన్నా.... ప్రజా సంక్షేమానికి పట్టం కట్టాలన్నా ఆ పార్టీతోనే సాధ్యం. ఆంక్షల కంచెల్ని చీల్చుకుంటూ.. ప్రజా ఆకాంక్షల మేరకు ఆవిర్భవించిందా పార్టీ. అదే వైఎస్సార్ సీపీ. ఈ పేరే ఒక సంచలనం.. పార్టీ ఆవిర్భావమే ఓ సంచలనం..



కష్టాలను తట్టుకుంటూ.... కన్నీళ్లను దిగమింగుకుంటూ ఉదయించిన ప్రజా నాయకుడతడు.. కేంద్రంలోని పెద్దల వంచనను నిలదీస్తూ.. పార్టీలన్నీ ఒక్కటై పన్నిన కుట్రలను పటాపంచలు చేస్తూ... ఎదిరించి గెలిచిన విజేతతడు. అతడే.. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్‌జగన్ మోహన్ రెడ్డి. సరిగ్గా 14 ఏళ్ల క్రితం వైఎస్సార్ ఘాట్ వద్ద రెపరెపలాడుకుంటూ నింగికెగిరిన పార్టీ జెండా.. నేడు ప్రజల గుండెల్లో నిలిచి పోయింది.

- 2011 మార్చి 12న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం
- వైఎస్సార్ సమాధి ఘాట్ వద్ద పార్టీ పేరు, జెండా ఆవిష్కరణ
- పార్టీ ఆవిర్భావమే ఓ సంచలనం!

సాక్షి కడప: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా... కుటిల రాజకీయాలను తరిమికొట్టడమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించింది. 'పార్టీ అంటే సామాన్య విషయం కాదు...ఎన్ని రోజులు నడుపుతారో చూస్తా'మంటూ ప్రగల్భాలు పలికిన నేతలు కాలగర్భంలో కలిసిపోగా ప్రజల పక్షాన నిలిచిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో తిరుగులేని విజయాలు సాధించింది. కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీ పెద్దలు ఏకమై వచ్చినా ఎదురొడ్డి చరిత్ర తిరగరాసే విజయాలు సాధించి యావత్ భారతదేశంలోనే పేరు గాంచింది. ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ విలువలు కలిగిన రాజకీయాలు చేస్తూ ప్రజల మనస్సులో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. నిత్యం ప్రజా పక్షమై పోరాడుతూ ప్రజా నాయకుడిగా నిలిచిపోయారు. తాజాగా కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలపై.. అరాచకాలపై మరో పోరుబాటకు పిలుపునిచ్చారు.

చరిత్ర తిరగరాసిన ఉప ఎన్నికలు

కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బయటికి వచ్చిన అప్పటి ఎంపీ, ప్రస్తుత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అప్పటి పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ విజయమ్మ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో భారీ విజయాన్ని దక్కించుకున్నారు. వారు అందుకున్న విజయం చరిత్ర నివ్వెరపోయేలా పులివెందుల, కడప పార్లమెంటు ప్రజలు తీర్పునిచ్చారు. 2011 మే నెలలో జరిగిన ఉప ఎన్నికలు దేశ స్థాయిలో చర్చ జరిగేలా చేశాయి. ఆ ఉప ఎన్నికల్లో కడప ఎంపీ స్థానానికి సంబంధించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున 5.44 లక్షలకు పైగా మెజార్టీతో అఖండ విజయం సాధించి పార్లమెంటు స్థాయిలో రికార్డు సృష్టించారు.

అనునిత్యం ప్రజల్లో.....అందుకే పట్టం!

2011 నుంచి ఇప్పటివరకు ప్రజానేతగా, ప్రతిపక్ష నేతగా, ప్రజల ముఖ్యమంత్రిగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం అనునిత్యం వారి మధ్యే గడుపుతున్నారు. హోదా ఏదైనా ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉంటూ వారి మధ్యే గడుపుతూ ప్రజా హృదయనేతగా గుర్తింపు పొందారు. ప్రజా సంకల్పం పేరుతో ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం దాకా పాదయాత్ర చేశారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో 151 అసెంబ్లీ స్థానాలతోపాటు 22 లోక్‌సభ స్థానాల్లో విజయఢంకా మోగించారు.

సంక్షేమ ముద్ర

రాష్ట్ర ప్రజల గుండెల్లో 2019–24 చరిత్రలో లిఖింపదగ్గ అధ్యాయంగా గుర్తింపు పొందింది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ పేద ప్రజలఅభ్యున్నతికి కృషి చేశారు. తన హయాంలో పేద ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందేలా పథక రచన చేసి సఫలీకృతులయ్యారు.

వైఎస్సార్ ఘాట్ నుంచే శ్రీకారం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం మొదలుకొని ప్రతి కార్యక్రమం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడి సమాధి ఘాట్ వద్ద నుంచే ప్రారంభిస్తూ వచ్చారు. వైఎస్సార్ సీపీ అధినేతగా ఇడుపులపాయ నుంచే పాదయాత్ర చేశారు. అలాగే పార్టీ ఆవిర్భావం...జెండా ఆవిష్కరణ....అభ్యర్థుల ప్రకటనలు....నామినేషన్ పత్రాలు... మొదటి ప్లీనరీ... ఇలా ఎలాంటి కార్యక్రమం తలపెట్టినా వైఎస్సార్ ఘాట్ వద్దకు వచ్చి ఆశీస్సులు తీసుకున్న తర్వాతనే ముందుకు కదిలేవారు.

15 వసంతంలోకి వైఎస్సార్ సీపీ

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించి నేటికి సరిగ్గా 14 ఏళ్లు పూర్తి చేసుకుని 15వ వసంతంలోకి అడుగు పెడుతోంది. ఈ సందర్భంగా పార్టీ తరఫున పలు కార్యక్రమాలు చేపట్టాలని సంకల్పించారు. పార్టీ కార్యాలయాల్లో జెండా ఆవిష్కరణలతోపాటు దివంగత వైఎస్సార్ విగ్రహాలకు పాలాభిషేకాలు, పూలమాలలతో ఘనంగా నివాళులర్పించనున్నారు. అందుకు సంబంధించి ఇప్పటికే పార్టీ అధిష్టానం నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చింది.

సాగు భళా..దిగుబడి డీలా!



జిల్లాలో రబీలో పంట సాగు వివరాలు హెక్టార్లలో...

పంట సాగైన	విస్తీర్ణం
శనగ	77653
మినుము	21712
నువ్వులు	4129
జొన్న	6405
వేరుశనగ	2826
వరి	6162
పెసర	1529
ఉలవలు	1586
సజ్జలు	1747
మొక్కజొన్న	2382
కుసుమ	148
కంది	224
కొర్ర	156

రైతు మరోసారి నష్టపోయాడు. 'కాలం' కలిసిరాక అప్పుల గాళానికి చిక్కి అల్లాడిపోయాడు. ఇంటిల్లిపాది కలిసికట్టుగా పని చేసినా పెట్టుబడి కూడా రాని దుస్థితి నెలకొంది. ఇక ప్రభుత్వం నుంచి 'సుఖీభవ' లేక... రైతన్నకు దుఃఖమే మిగిలింది. చివరిగా గిట్టుబాబు ధర కోసం శ్రమించాల్సి వస్తోంది.



రాజుపాలెం మండలంలో తెగుళ్లగాటికి దెబ్బతిన్న శనగపంట



అక్టోబర్ నెలలో కురిసిన వర్షాలకు దేవుని కడప సమీపంలో దెబ్బతిన్న వరిపంట (ఇన్‌సెట్) ఎడతెరిపలేకుండా కురిసిన వర్షాలతో మొలకెత్తిన వరిగింజలు

- ముగిసిన రబీ సీజన్
- జిల్లావ్యాప్తంగా 1,27,465 హెక్టార్లలో సాగైన పంటలు
- వందశాతం మించి సాగైన మొక్కజొన్న, మినుము, కంది పంటలు
- జిల్లాలో 89.14 శాతంమేర సాగైన పంటలు

కడప అగ్రికల్చర్: ఈ ఏడాది రబీ సీజన్‌లో పంటలు ఆశాజనకంగా సాగైనా.. దిగుబడి రాక రైతులు దిగాలు పడ్డారు. రబీ ప్రారంభంలోనే వర్షాలు కురవడంతో రైతులు ఉత్సాహంగా పంటలను సాగు చేశారు. దిగుబడి చేతి కొచ్చే సమయానికి అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలకు దిగుబడి భారీగా తగ్గింది. కొన్ని ప్రాంతాల్లో పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంది. దీనికితోడు ప్రభుత్వ ప్రోత్సాహం కూడా కరువైంది. పంటల సాగు కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతన్నలకు ఇస్తామన్న రూ. 20 వేల రైతు భరోసాను కూడా ఇవ్వకుండా మొండి చేయి చూపింది. దీనికితోడు ఇటు పంటలసాగులో దిగుబడి రాక... అటు ప్రభుత్వం ఆదుకోక అన్నదాతలు అప్పుల ఊబిలో చిక్కుకుపోయారు. అరకొరగా వచ్చిన దిగుబడులకైనా గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.


పెరిగిన సాగు..

ఈ ఏడాది జిల్లాలో వర్షాలు బాగా కురవడంతో రబీ పంటసాగు పెరిగింది. జిల్లావ్యాప్తంగా సాధారణసాగు 1,42,988 హెక్టార్లుకాగా మార్చి 1వ తేదీ రబీ సీజన్ ముగిసే నాటికి 1,27,465 హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి. ఇందులో ఉలవ సాధారణసాగు 428 హెక్టార్లుకాగా 1586 హెక్టార్లలో సాగై 370.57 శాతం మేర సాగు కాగా పొగాకు సాధారణసాగు 59 హెక్టార్లుకాగా 182 హెక్టార్లలోసాగై 308.47 శాతం మేర నమోదైంది. ఇక మొక్కజొన్న 165.43 శాతం, మినుము 147.39 శాతం, కంది 110.77 శాతం, శనగపంట 94.40 శాతం మేర సాగయ్యాయి. ఆరుతడి పంటలు ఆశాజనకంగా సాగైనా దిగుబడి చేతి కొచ్చే సమయానికి దిగుబడులు తగ్గి రైతన్నలకు నష్టాలే మిగిలాయి.

అంతంత మాత్రంగానే సేవలు.....

గత ప్రభుత్వం రైతులకు సేవలు అందించడానికి భరోసా కల్పిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. జిల్లావ్యాప్తంగా 420 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి పరిధిలో వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధశాఖ ఉద్యోగాలను నియమించి సేవలను అందుబాటులోకి తెచ్చారు. విత్తనం మొదలుకుని పంట అమ్ముకునే వరకు ఎరువులు, క్రిమి సంహారక మందులు, విత్తన పరీక్షలు, ఈ క్రాపు బుకింగ్, ఇన్‌పుట్ సబ్సిడీ, పెట్టుబడి సాయం అందించేవారు. వీటితోపాటు రైతులకు భూసార పరీక్షలను చేయడంతోపాటు రైతులకు నకిలీ ఎరువులు, పురుగు మందులను అందించేందుకు వీలు లేకుండా అగ్రిల్యాబ్‌లను ఏర్పాటు చేసి సేవలను అందించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు భరోసా కేంద్రాలను (ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలు) నిర్లక్ష్యం చేస్తోంది. రైతులకు కావాల్సిన సేలను సరిగా అందించడం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

నష్టమే..



నా పేరు సానేపల్లి సాంబశివారెడ్డి. మాది కమలాపురం మండలం కంచెన్నగారిపల్లె. నేను 3 ఎకరాల 20 సెంట్లలో శనగ పంటను సాగు చేశాను. దిగుబడి చూస్తే ఎకరాకు రూ. 26 వేలు చొప్పున వచ్చింది. ఖర్చేమో 26 వేలు దాటింది. **- సాంబశివారెడ్డి, కంచెన్నగారిపల్లె. కమలాపురం మండలం**

రైతులను ఆదుకోవాలి



రబీలో సాగు చేసిన ఆరుతడి పంటలు ప్రకృతి వైపరీత్యాలతో బాగా దెబ్బతిని దిగుబడి తగ్గింది. దీంతో చాలా మంది రైతులకు ఖర్చులు కూడా రాలేదు. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలి. **- దస్తగిరిరెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి.**

క్లుప్తంగా

అక్రమంగా ముగ్గురాయి తవ్వకాలకు యత్నం

– భూ యజమానిపై టీడీపీ నాయకుల దౌర్జన్యం

లింగాల : తన పొలంలో టీడీపీ నాయకులు అక్రమంగా ముగ్గురాయి తవ్వకాలు నిర్వహిస్తున్నట్లు లింగాల మండలం ఇప్పట్ల గ్రామానికి చెందిన టి. విజయమోహన్‌రెడ్డి తెలిపారు. ఓబుళరెడ్డి, మనోహర్‌రెడ్డిలు ముగ్గురాయి తవ్వకాలు చేపట్టారని, దీనిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా తనపై దాడి చేసేందుకు యత్నించారన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఎస్పీలకు, లింగాల పోలీసులకు, తహసీల్దార్లకు ఫిర్యాదు చేశానన్నారు. తనకు సంబంధించిన సర్వే నంబర్ 435/1, 435/2, 434 సర్వే నంబరు నందుగల 7ఎకరాల 75సెంట్లు విస్తీర్ణం గల వ్యవసాయ భూమి ఉందన్నారు. ఈ సర్వే నంబర్లకు తనకు మైనింగ్ లీజ్ ఉందన్నారు. తన భూమిపై వీరికి ఎలాంటి హక్కు లేదన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం


విద్యార్థిని భార్గవిని పరామర్శిస్తున్న ఏఐఎస్‌బీ, ఆర్‌ఎస్‌యూ నాయకులు

కలసపాడు : కలసపాడు మండలంలోని పెండ్లిమర్రి వద్ద ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న భార్గవి సోమవారం రాత్రి పాఠశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. తీవ్రంగా గాయపడిన ఆ బాలికను చికిత్స నిమిత్తం సిబ్బంది పోరుమామిళ్లలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం అక్కడి నుంచి కడప రిమ్స్‌కు, ఆ తర్వాత వైద్యుల సూచన మేరకు తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపల్ రెడ్డిజ్యోతిని వివరణ కోరగా విద్యార్థిని ప్రమాదవశాత్తు మెట్లపై నుంచి కింద పడిందని, వెంటనే అక్కడ ఉన్న సిబ్బందికి తెలియజేసి పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించామని తెలిపారు.

విచారణ జరపాలి..

కడప ఎడ్యుకేషన్: విద్యార్థిని భార్గవి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలపై విచారణ జరపాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏ.ఐ.ఎస్.బి) జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్ర ప్రసాద్, రివల్యూషనరి స్టూడెంట్ యూనియన్ (ఆర్.ఎస్.యూ) జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఇందుకు ఉపాధ్యాయుల వేధింపులే కారణమన్నారు. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని భార్గవిని మంగళవారం వారు పరామర్శించారు.పాఠశాలలో జరిగిన ఘటనపై తప్పుడు సమాచారం ఇచ్చిన ఎస్.ఓపై, విద్యార్థినిని వేధించిన ఉపాధ్యాయులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.

దాడి ఘటనలో కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో పులివెందుల రోడ్డు సాక్షి సర్కిల్ సమీపంలో ఈనెల 10వ తేదీన పాతసామాన్ల అంగడిని నిర్వహిస్తున్న విక్రమ్ వద్దకు మాట్లాడేందుకు మల్లికార్జున అనే వ్యక్తి వెళ్లాడు. ఆ సమయంలో అక్కడున్న కిషోర్, ప్రకాష్, ఇంకా ముగ్గురు మల్లికార్జునను ఎగతాళి చేశారు. దీంతో ఈ విషయాన్ని మల్లికార్జున తన సోదరుడు, సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి మద్దిలేటికి తెలియజేశాడు. మద్దిలేటి వారిని అడిగేందుకు సంఘటన స్థలానికి వెళ్లగా వారు మద్దిలేటి, అతని సోదరుడు మల్లికార్జునపై దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

జమాలయ్యా.. సలామయ్యా!

- కరువును పారదోలిన తాపసిగా గుర్తింపు
- 14, 15న కృష్ణంపల్లె ఉరుసు మహోత్సవం
- విశేష సంఖ్యలో తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లలో నిమగ్నమైన నిర్వాహకులు


జమాలయ్య దర్గా

కడప సెవెన్‌రోడ్స్/దువ్వూరు : ఆ దర్గా ధర్మకర్తలు హిందువులు. ఉరుసు నిర్వహణలో ప్రధాన భూమిక వారిదే. మహోత్సవంలో పాల్గొనేందుకు విశేషంగా తరలివచ్చేదీ వారే. హిందూ–ముస్లిం సఖ్యత, సామరస్యాలకు నిలువెత్తు ప్రతిరూపంగా భాసిల్లుతున్న దాని పేరు కృష్ణంపల్లె జమాలయ్య దర్గా. మైదుకూరు–ఆళ్లగడ్డ రహదారిలో కానగూడూరు గ్రామం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో తూర్పున ఉంది. సుదూర ప్రాంతాల నుంచి సైతం కులమతాలకు అతీతంగా భక్తులు నిత్యం ఈ దర్గాను దర్శించి తరిస్తుంటారు. శుక్రవారాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. కోర్కెలు తీర్చే కల్పవృక్షంగా జమాలయ్యాను భక్తులు విశ్వసిస్తుంటారు.

కరువును పారదోలి..

అది 1876 నాటి తెలుగు ధాతనామ సంవత్సరం. చరిత్రలో పెను విషాదాన్ని మిగిల్చిన సంవత్సరం. వర్షాలు లేక భయంకర కరువు వచ్చింది. బ్రిటీషు పాలనలో సంభవించిన 31 కరువుల్లో ఇది ఎక్కువ నష్టం కలిగించింది. ఎక్కడా పంటలు సాగు కాలేదు. బావులు, చెరువులు, నదులు ఎండిపోయి మనుషులు, పశువులు తాగునీటికి విలవిల్లాడిపోయారు. మద్రాస్ శానిటరీ కమిషనర్ రాబర్ట్ కార్నిష్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికల ప్రకారం తినడానికి తిండిలేక ఆకలి బాధతో జిల్లాలో వేలాది మంది మరణించారు. కలరా, మసూచి జ్వరాలు, పేగు సంబంధిత సమస్యల వల్ల మృత్యువాత పడ్డారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సహాయ శిబిరాల్లో, ఉపాధి పనుల ప్రదేశాల్లో సైతం జనం పిట్టల్లా రాలిపోయారు. పశు సంపదకు లెక్కేలేదు. మానవ ప్రయత్నాలన్నీ విఫలమైనప్పుడు దేవుని వైపు చూడడం సహజం. పుష్పగిరి లాంటి ప్రముఖ ఆలయాల్లో ప్రభుత్వమే వరుణ యాగాలు చేయించింది. ఈ పరిస్థితుల్లో నంద్యాలకు చెందిన జమాల్‌వలీ సాహెబ్ రాజుపాలెం మండలంలోని వెలవలి గ్రామానికి వచ్చారు. దువ్వూరు మండలం కృష్ణంపల్లెకు చెందిన నాగిరెడ్డి ఓసారి ఏదో పనిమీద వెలవలి గ్రామానికి వెళ్లగా జమాల్‌వలీ సాహెబ్ ఆయన వెంట వచ్చేశారు. కరువు కాలంలో ప్రజల దయనీయ పరిస్థితిని చూసి చలించిపోయారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలతో దేశం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఆయన సమీపంలోని యేటిలో కూర్చొని కఠోర తపోదీక్ష చేపట్టారు. ఎట్టకేలకు జమాలయ్య సాహెబ్ తపము ఫలించి ప్రకృతి కరుణించడంతో భారీ వర్షాలు కురిశాయి. నదులు, చెరువులు, బావులు, కుంటలు పొంగి పొర్లడంతో ప్రజలు ఆనంద పరవశులయ్యారు. అప్పటి నుంచి జమాలయ్య జిల్లా ప్రజలకు ఆరాధ్యుడయ్యారు. 1883లో ఆయన తనువు చాలించారు. వెన్నపూస ఎరికలరెడ్డి, నాగిరెడ్డి సోదరులకు చెందిన పొలంలో జమాలయ్య దర్గా నిర్మాణం జరిగింది. నేటికీ ఆ వంశీయులే ధర్మకర్తలుగా వ్యవహరిస్తున్నారు.

142వ ఉరుసు మహోత్సవం

ప్రతియేటా ఫాల్గుణ పౌర్ణమి రోజున గంధం, పాడ్యమి రోజు ఉరుసు మహోత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. ఈనెల 14వ తేదీ శుక్రవారం రాత్రి గంధం, 15న శనివారం ఉరుసు మహోత్సవాలు జరగనున్నాయి. 142వ ఉరుసు నిర్వహణ కోసం దర్గాను ముస్తాబు చేస్తున్నారు. ఇప్పటికే దర్గాకు రంగులుఅద్ది విద్యుద్దీపాలు, చలువ పందిళ్ల వంటి ఏర్పాట్లు జరుగుతున్నాయి. నిరంతరాయ విద్యుత్ సరఫరా, తాగునీరు, వైద్య శిబిరం, 108, పటిష్ట పోలీసు బందోబస్తు లాంటి ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమై ఉన్నారు. శుక్రవారం సాయంత్రానికి ప్రొద్దుటూరుకు చెందిన ముస్లింలు గంధం తీసుకొస్తారు. ధర్మకర్తల ఇంటి నుంచి మేళతాళాలు, బాణాసంచా పేలుళ్ల వంటి కార్యక్రమాల మధ్య గ్రామంలో చాందినీలో గంధం ఊరేగింపు నిర్వహిస్తారు. ఉరుసు రోజు రాత్రి జెండా ఊరేగింపు ఉంటుంది. ఇతర జిల్లాల నుంచి సైతం భక్తులు వస్తారు గనుక ఎవరికీ ఇబ్బందులు తలెత్తకుండా గ్రామానికి చెందిన దాతలు అన్నదానం, మరుగుదొడ్ల సౌకర్యం, తాగునీరు వంటి ఏర్పాట్లు చేస్తున్నారు.

➠ 15న బండలాగుడు పోటీలు

ఉరుసు ఉత్సవాల్లో భాగంగా ఈనెల 15న ధర్మకర్తల ఆధ్వర్యంలో బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి ఈ కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఉదయం 6.30 గంటలకు ధర్మకర్త పుల్లారెడ్డి ఇంటి వద్ద చీటీలు పంపిణీ చేస్తారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారిలో ప్రథమ బహుమతిగా రూ. 30,116లను వెన్నపూస పెద్ద పుల్లారెడ్డి, ద్వితీయ బహుమతిగా రూ. వెన్నపూస చిన్న పుల్లారెడ్డి రూ. 20,116, తృతీయ బహుమతిగా వెన్నపూస సాయినాథరెడ్డి రూ. 10,116, నాల్గవ బహుమహతిగా వెన్నపూస రమ్యశ్రీ రూ. 5,116 అందజేస్తారు. అదేరోజు రాత్రి కృష్ణంపల్లె కళాకారులు సత్య హరిశ్చంద్ర నాటకం ప్రదర్శించనున్నారు.

కోర్కెలు తీర్చే కల్పతరువు



భక్తుల కోర్కెలు తీర్చే కల్పతరువుగా జమాలయ్య స్వామి ప్రసిద్ధుడు. సంతానం పొందిన భక్తులు ముస్లింలైతే తమ పిల్లలకు జమాల్‌వలీ, జమాల్‌బాషా, హిందువులైతే జమాల్‌రెడ్డి, జమాలయ్యా అనే పేర్లు పెట్టుకోవడం జిల్లాలో సర్వసాధారణం. ఉరుసు ఉత్సవాల్లో ప్రొద్దుటూరు నుంచి ముస్లింలు గంధం తీసుకొస్తే, మా ఇంటి నుంచి మేము జెండా మెరవణి చేపడతాము. ఉరుసు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు దాదాపు పూర్తి కావచ్చాయి.

– వెన్నపూస పుల్లారెడ్డి, ధర్మకర్త

ఘనంగా ఉరుసు మహోత్సవం



రెండు రోజులపాటు గంధం, ఉరుసు మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మూడవరోజు జియారత్ కార్యక్రమం ఉంటుంది. ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ, నంద్యాల నుంచే కాకుండా గుంటూరు, తెనాలి ప్రాంతాల నుంచి కూడా భక్తులు ప్రత్యేక బస్సుల్లో వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. భక్తుల సౌకర్యం కోసం ఇక్కడ అన్నదాన సత్రం ఉంది. ఎప్పటిలాగా భక్తులు తరలివచ్చి ఉత్సవాలు విజయవంతం చేయాలి.

– సయ్యద్ జమాల్‌బాషా, ముజావర్, జమాలయ్య దర్గా

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

జేసీ అదితి సింగ్


రికార్డులను పరిశీలిస్తున్న జేసీ అదితి సింగ్

వల్లూరు : ఈ నెల 17వ తేదీ నుంచి జరగనున్న పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన వల్లూరులోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను, విద్యార్థుల రిజిష్టర్లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం అందుతోందా? కాస్మొటిక్ చార్జీలు నెలవారీ అందుతున్నాయా? వసతులు ఎలా ఉన్నాయి? తదితర వివరాలను విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ప్రతి రోజు మెనూ ప్రకారమే భోజనం వడ్డించాలని, నాణ్యత విషయంలో ఏ మాత్రం రాజీ పడవద్దని సిబ్బందికి సూచించారు. అనంతరం ఉపాధ్యాయ సిబ్బందితో మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని, 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పరీక్షల్లో ఎలాంటి భయం లేకుండా బాగా పరీక్షలు రాసే విధంగా విద్యార్థులకు ధైర్యం చెప్పాలన్నారు. అలాగే విద్యార్థులకు మంచి విద్యా బోధనతో పాటు మంచి క్రమశిక్షణ కూడా నేర్పించాలన్నారు. పాఠశాలలో చేయాల్సిన అభివృద్ధి పనులు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని, వాటిని పరిశీలించి పూర్తి చేసేందుకు కృషి చేస్తానని ప్రిన్సిపల్‌కు సూచించారు. కడప ఆర్‌డీఓ జాన్ ఎర్విన్, జిల్లా అధికారులు ఆమె వెంట ఉన్నారు.

ప్రైవేట్ హాస్పిటల్ సీజ్

అనుమతి లేకుండా కాన్పులు చేస్తున్నారని ఫిర్యాదు


ఫ్లోరెన్స్ హాస్పిటల్‌ను సీజ్ చేస్తున్న వైద్యాధికారులు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక విజయనగరం వీధిలోని ఫ్లోరెన్స్ హాస్పిటల్‌ను వైద్యాధికారులు సీజ్ చేశారు. జనరల్ ఫిజీషియన్‌కు మాత్రమే ఈ హాస్పిటల్‌కు ప్రభుత్వ అనుమతి ఉంది. అయితే ఇటీవల ఇక్కడ కాన్పులు, సిజేరియన్లు నిర్వహిస్తున్నారని ఫిర్యాదులు వెళ్లడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఫ్లోరెన్స్ హాస్పిటల్‌కు వెళ్లారు. హాస్పిటల్‌లోని డాక్టర్ సాయిప్రసాద్‌తో మాట్లాడారు. అయితే ఇక్కడ జరిగే ప్రసవాల గురించి తనకు తెలియదని ఆయన వైద్యాధికారులకు తెలిపారు. హాస్పిటల్‌లోని సిబ్బందితో కూడా మాట్లాడారు. గైనకాలజీకి అనుమతి లేకున్నా ఎలా ప్రసవాలు చేస్తారని ప్రశ్నించారు. పూర్తి నివేదికను కలెక్టర్, డీఎంహెచ్‌ఓలకు పంపిస్తామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ తెలిపారు. తర్వాత సిబ్బంది అందరిని బయటికి పంపించి హాస్పిటల్‌ను సీజ్ చేశారు. విషయం తెలుసుకున్న జమ్మలమడుగు ఆర్డీఓ సాయిశ్రీ ఫ్లోరెన్స్ హాస్పిటల్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డెమో భారతి, దేవాంగపేట మెడికల్ ఆఫీసర్ అలిమ్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వారాహి హాస్పిటల్‌ను పరిశీలించిన ఆర్డీఓ సాయిశ్రీ

జమ్మలమడుగు ఆర్డీఓ సాయిశ్రీ మంగళవారం ప్రొద్దుటూరులోని వారాహి హాస్పిటల్‌ను పరిశీలించారు. ఇటీవల ఈ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ పసికందు మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే హాస్పిటల్ వైద్యుడి నిర్లక్ష్యం కారణంగా తమ బిడ్డ మృతి చెందాడని దంపతులు ఆరోపించిన నేపథ్యంలో పలు పత్రికల్లో కథనాలు వచ్చాయి. దీంతో ఆర్డీఓ హాస్పిటల్‌కు వచ్చారు. అయితే ఆ సమయంలో హాస్పిటల్ వైద్యులు అందుబాటులో లేరు. పసికందు మృతి, హాస్పిటల్ అనుమతుల గురించి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శివప్రసాద్‌రెడ్డిని అడిగారు. పసికందుకు అందించిన చికత్సపై విచారణ చేస్తామని ఆయన ఆర్డీఓతో అన్నారు. తర్వాత బాధిత పసికందు తల్లిదండ్రులతో మాట్లాడారు.

పర్యాటక సర్క్యూట్‌గా అభివృద్ధి చేస్తాం

కలెక్టర్ శ్రీధర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా సంస్కృతి సంప్రదాయాలకు నిలయమని, వాటి విలువలు అందరికీ తెలిపే విధంగా ప్రసిద్ధ ప్రదేశాలు ఆలయాలను కలుపుతూ పర్యాటక సర్క్యూట్ గా అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. మంగళవారం భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన ఇంటాక్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పురాతన కట్టడాలు, కళలు, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక అంశాలపై జిల్లా సంస్కృతి గొప్పదనాన్ని తెలిపే విధంగా ఏడాదిలో నాలుగు రకాల ఉత్సవాలను జరిపే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. ఇందులో కడపోత్సవాలు, గండికోట ఉత్సవాలు, పురాతన వారసత్వ ఉత్సవాలు , గుడి సంబరాలు వంటివి ఉండాలని సూచించారు. జిల్లాలో ఉన్న టెంపుల్ టూరిజాన్ని అభివృద్ధి చేసే విధంగా టూరిజం సర్క్యూట్ ను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న జానపదాలు, సాహిత్యాలు, కళలు, ఫోక్ డాన్సులు వంటి వాటిపై విద్యార్థుల్లో అవగాహన పెంచాలన్నారు. ఇంటాక్ కన్వీనర్ చిన్నపరెడ్డి మాట్లాడుతూ గండికోట వరల్డ్ హెరిటేజ్ గా యునెస్కో గుర్తింపుకోసం కృషి చేస్తున్నామని.. ఇందుకు జిల్లా యంత్రాంగ సహాయ సహకారాలు అందించాలని కోరారు. జిల్లా పర్యాటక శాఖ ఇంచార్జీ అధికారి సురేష్ కుమార్, టూరిజం మేనేజర్ రామ్ కుమార్,ఇంటాక్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించే గ్యాస్ ఏజెన్సీలపై చర్యలు

ప్రభుత్వ నిబంధనలకు లోబడే గ్యాస్ సిలిండర్లను వినియోగదారులకు సరఫరా చేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు హెచ్చరికలు జారీచేశారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్‌లో హాలులో జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులతో జేసీ అదితిసింగ్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్యాస్ సరఫరాపై ప్రభుత్వానికి వినియోగదారుల నుంచి అసంతృప్తికరమైన సందేశాలు అందాయన్నారు. గ్యాస్ ఏజెన్సీలు సిలిండర్లను ఇంటికి సరఫరా చేసే సమయంలో డెలివరీ బాయ్స్ అదనపు చార్జీలను వినియోగదారుల నుండి వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు అందడంపై ప్రభుత్వం సీరియస్ గా పరిగణించిందన్నారు. జిల్లాలో అదనపు చార్జీల వసూళ్లకు పాల్పడుతున్న 15 ఏజెన్సీలకు ఇప్పటికే నోటీసులు ఇచ్చామని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించే గ్యాస్ ఏజెన్సీలపై కఠినంగా వ్యవహరిస్తామని కలెక్టర్ హెచ్చరికలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డీఎస్‌ఓ రెడ్డి చంద్రిక, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు, పాల్గొన్నారు.

హోంగార్డుల సేవలు అభినందనీయం


హోంగార్డ్స్ పెరేడ్‌లో గౌరవవందనం స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్


ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేస్తున్న జిల్లా ఎస్పీ

హోంగార్డుల డీ మొబిలైజేషన్ పెరేడ్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్‌కుమార్








కడప అర్బన్ : పోలీసులతో సమానంగా విధులు నిర్వర్తిస్తూ అందరి మన్ననలు చూరగొంటున్న హోంగార్డుల సేవలు అభినందనీయమని జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్ కొనియాడారు. జిల్లాలోని హోంగార్డ్స్ సిబ్బందికి వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు రెండు వారాలపాటు నిర్వహించిన మొబిలైజేషన్ కార్యక్రమం ముగింపు సందర్భంగా మంగళవారం డీ–మొబిలైజేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ హోంగార్డ్స్ పెరేడ్ (కవాతు)ను పరిశీలించి గౌరవ వందనాన్ని స్వీకరించారు. పెరేడ్‌ను ప్రతిభావంతంగా, క్రమశిక్షణతో చేశారని జిల్లా ఎస్పీ హోంగార్డులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ శిక్షణా కాలం అనేది కీలకమని, విద్య నేర్చుకున్న అనంతరం సమాజానికి ఉపయోగపడకపోతే ఆ విద్యకు విలువ ఉండదన్నారు. అలాగే ఈ శిక్షణలో హోంగార్డులు నేర్చుకున్న అంశాలను దైనందిన విధుల్లో ప్రతిబింబించేలా చూడాలన్నారు. దేశ అంతర్గత భద్రతను పరిరక్షించడంలో హోంగార్డ్స్ సిబ్బంది కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. పోలీస్ శాఖతో పాటు అగ్నిమాపక, ఆర్.టి.ఓ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, జైళ్లశాఖ తదితర వాటిలో కీలకవిధులు నిర్వర్తిస్తూ ఆయా శాఖలకు వెన్నెముకగా నిలిచారని ఎస్పీ పేర్కొన్నారు. హోంగార్డుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలనీ, పరిశీలించి పరిష్కరిస్తాని జిల్లా ఎస్పీ భరోసా ఇచ్చారు. బ్యాండ్ పార్టీ ఏ.ఆర్. హెడ్‌కానిస్టేబుల్ పి.బాబు, బృందాన్ని పెరేడ్ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన హోంగార్డ్‌లకు బహుమతులు అందజేశారు. ఏ.ఆర్ అదనపు ఎస్పీ బి. రమణయ్య మాట్లాడుతూ రాయలసీమలోనే మొట్టమొదటిసారిగా హోంగార్డ్స్ సిబ్బందికి మొబిలైజేషన్ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ ఈ.జీ. అశోక్‌కుమార్ ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్. డీఎస్పీ కె. శ్రీనివాసరావు, ఆర్‌ఐలు శ్రీశైలరెడ్డి, ఆనంద్, టైటస్, వీరేష్, శివరాముడు, ఆర్.ఎస్.ఐలు, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, హోంగార్డుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఈనెల 13న జ్యోతి క్షేత్రానికి ఎంపీ అవినాష్‌రెడ్డి రాక

పోరుమామిళ్ల : ఈనెల 13న గురువారం ఉదయం 8–30 గంటలకు కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి జ్యోతి క్షేత్రం కాశినాయన క్షేత్రాన్ని సందర్శిస్తారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె. రమణారెడ్డి తెలిపారు. మూడు దశాబ్దాలుగా అక్కడ జరుగుతున్న అభివృద్ధి, నిత్యాన్నదానం, కాశినాయన సమాధిని సందర్శించుకుంటున్న వేలాదిమంది భక్తుల విశ్వాసం విస్మరించి, అక్కడ అధికారులు కట్టడాలు కూలగొట్టడంపై స్వయంగా తెలుసుకొనేందుకు ఎంపీ వస్తున్నారన్నారు. ఆయనతో పాటు బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, జిల్లా నాయకులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి



మృతి చెందిన నగళ్లపాటి సుబ్బరాయుడు, గాయపడిన కృష్ణవేణిని ప్రొద్దుటూరుకు తరలిస్తున్న 108 వాహన సిబ్బంది

జమ్మలమడుగు రూరల్ : రోడ్డు పక్కన నిలబడి నీళ్లు తాగుతుండగా వేగంగా వచ్చిన బొలేరో వాహనం ఢీకొని ప్రొద్దుటూరుకు చెందిన నగళ్లపాటి సుబ్బరాయుడు (63) అనే విశ్రాంత ఉపాధ్యాయుడు మృతి చెందాడు. జమ్మలమడుగు మండలంలో మంగళవారం రాత్రి 9.30 గంటలకు జరిగిన ప్రమాద సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన నగళ్లపాటి సుబ్బరాయుడు సొంత పనుల నిమిత్తం స్వగ్రామం అయిన మైలవరం మండలం వేపరాల గ్రామానికి భార్య కృష్ణవేణితో కలిసి వచ్చాడు. పనులు ముగించుకుని స్కూటీలో తిరిగి ప్రొద్దుటూరు వెళుతుండగా మార్గమధ్యంలోని ధర్మాపురం గ్రామం వద్దకు వెళ్లగానే దాహం వేసింది. దీంతో స్కూటీని ఆపి నీళ్లు తాగుతుండగా ప్రొద్దుటూరు వైపు వెళుతున్న బొలెరో క్యాంపర్ వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో నగళ్లపాటి సుబ్బరాయుడు అక్కడికక్కడే మృతి చెందగా భార్య కృష్ణవేణికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 వాహనంలో బాధితురాలిని ప్రొద్దుటూరుకు తరలించారు. విషయం తెలిసిన వెంటనే పట్టణ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

సనాతన ధర్మం అంటూ కూల్చివేయడం తగదు

వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి శ్యామల

కాశినాయన : సనాతన ధర్మం అంటూ ఆశ్రమాల్లో కూల్చివేతలు తగదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఆరే శ్యామల పేర్కొన్నారు. కాశినాయన మండలం జ్యోతిక్షేత్రంలోని కాశినాయన ఆశ్రమంలో కూల్చివేసిన కట్టడాలను ఆమె మంగళవారం పరిశీలించారు. అటవీశాఖ అధికారులు కూల్చివేసిన సాన్నపు గదులు, విశ్రాంతి గదులు, గోశాల, క్షౌ రశాలను ఆమె పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎంతో మంది అనాథలకు, నిరాశ్రయులకు అన్నం పెట్టే కాశినాయన ఆశ్రమాన్ని కూల్చివేయడం బాధాకరమన్నారు. సనాతన ధర్మం అంటే ఇదేనా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, జిల్లా సెక్రటరీ యాక్టివ్ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పోలిరెడ్డి, యూత్ నాయకుడు ప్రతాప్‌రెడ్డి, గొంటువారిపల్లె సర్పంచ్ పిచ్చిరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


జ్యోతిలో ఆలయ కూల్చివేతను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి శ్యామల